క్లుప్తంగా

ఏపీజీబీపై అధికారిక ప్రకటన చేయాలి

కడప సెవెన్‌రోడ్స్‌: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు మైదుకూరు బహిరంగ సభలో ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామ సేవ్‌ పబ్లిక్‌ సెక్టార్‌ కమిటీ కన్వీనర్‌ ఎ.రఘునాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీజీబీ అమరావతికి తరలిపోదనే భరోసా రాయలసీమ ప్రజలకు కలుగుతుందని, దీనిపై అధికారిక ప్రకటన చేయాలని కోరారు. కర్నూలుకు రావాల్సిన హైకోర్టు స్థానంలో బెంచ్‌ ఏర్పాటు చేస్తాన్నప్పుడే ప్రజలకు అనుమానాలు పెరిగాయన్నారు. విభజన హామీలు, స్టీల్‌ ప్లాంటు, హైకోర్టు, విద్యా సంస్థలు, పారిశ్రామిక రాయితీలు, తదితర విషయాల్లో ఆశాభంగానికి గురైన రాయలసీమ వాసులు ముఖ్యమంత్రి చేసిన రాజకీయ ప్రకటనలకు సంతృప్తి చెందడం లేదన్నారు.

ఉర్దూ క్యాలెండర్‌ విడుదల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అఫ్జల్‌ ఖాన్‌

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: మత సామరస్యం దేశ ఔన్నత్యాన్ని పెంచుతుందని కాంగ్రెస్‌ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్‌ అన్నారు. కడపలో ఆప్‌ కీ ఆవాజ్‌ ఉర్దూ క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌ఖాన్‌ మాట్లాడుతూ ముస్లిం సమాజాన్ని సామాజికంగా చైతన్య పరిచి వారి హక్కులు, బాధ్యతలను తెలియజేసేందుకు ఆప్‌ కీ ఆవాజ్‌ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఖయ్యద్‌ షాజహాన్‌బాషా, సయ్యద్‌చాంద్‌బాషా, ఇర్షాద్‌, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఈ మృతి



ఇరిగేషన్‌ ఏఈ నాగరాజు (ఫైల్‌)

కడప ఎడ్యుకేషన్‌: కడప ఇరిగేషన్‌ శాఖలో ఏఈ(మెకానికల్‌ డివిజన్‌)గా పనిచేస్తున్న నాగరాజు(42) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్‌ కళాశాలలో నిర్వహించిన క్రికెట్‌ పోటీలలో తోటి ఉద్యోగులతో కలిసి క్రికెట్‌ ఆడుతుండగా గుండెపోటు వచ్చినట్లు తెలిసింది. ఉద్యోగులు ఆయనను హుడావిడిగా కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. కడప సాయినగర్‌కు చెందిన నాగరాజు 2008 బ్యాచ్‌కు చెందిన వాడని, త్వరలో ఈయనకు డీఈగా పదోన్నతి రానున్నట్లు తెలిసింది. ఇంతలోనే ఈయన మృత్యువాత పడటం తోటి ఉద్యోగులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇరిగేషన్‌శాఖ సీఈ శ్రీనివాసులు, ఈఈలు, డీఈఈలు, ఏఈలు, తమ సంతాపాన్ని తెలిపారు.

ఆధ్యాత్మిక జీవితంలోనే ఆనందం

కడప కల్చరల్‌: ఆధ్యాత్మిక జీవనంలోనే నిజమైన ఆనందం ఉందని నగర పాలక సంస్థ అడిషనల్‌ కమిషనర్‌ రాకేష్‌ చంద్ర అన్నారు. కడప కృపా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ నేటివ్‌ కృపా చర్చిలో తొలుత పాస్టర్‌ పి.మహేష్‌, సిస్టర్‌ శాంతమ్మతోకలిసి ఆదివారం ఆయన ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి మాట్లాడారు. ఈ ప్రాంతంలోని ఈ నూతన చర్చి ప్రార్థనలు చేసుకునేందుకు ఎంతో అనువుగా ఉందన్నారు. దైవజనులు పాస్టర్‌ పి.మహేష్‌ విశ్వాసుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సంఘ పెద్దలు విశ్వాసులతో కలిసి అడిషనల్‌ కమిషనర్‌ రాకేష్‌ చంద్రను శాలువాతో సన్మానించి స్వీట్లు పంచి పెట్టారు. యస్‌.రోశయ్య, దూపం రాజు, పి.రవితేజ, జాన్‌, శాంతిరాజు, రోజా, అజయ్‌, నరసయ్య, కృప పాల్గొన్నారు.

బధిరులు రాణిస్తున్నారు



బహుమతి అందజేస్తున్న న్యాయ నిర్ణేతలు

కడప ఎడ్యుకేషన్‌: నేటి పోటీ ప్రపంచంలో బధిరులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని టీఎస్‌ఏస్‌ఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసపేట శివ, సింగ్‌ లాంగ్వేజ్‌ ఇన్‌స్ట్రక్టర్‌, ఇన్‌ క్లూజివ్‌ ఎడ్యుకేషన్‌ రీసోర్సు టీచర్‌ యశోద అన్నారు. కడప డిస్ట్రిక్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ద డెఫ్‌ ఆధ్వర్యంలో ఏపీఎఫ్‌డిడబ్లూ రాష్ట ప్రెసిడెంట్‌ ధరణికుమారి ఆధ్యక్షతన బధిర మహిళలకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో రేణుక, బుజ్జి ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించారు. చెన్‌బాల్‌ పోటీలో శ్రావణి, బుజ్జి , మైం డ్విన్‌లో శ్యామల, గౌరి, మైండ్‌గేమ్‌లో శివనిషత, సమీరా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్‌ రహ్మతుల్లా, సైక్‌ ఇర్ఫాన్‌, లక్ష్మీ కిశోర్‌, ఇర్ఫాన్‌, వెంకా బాల రెడ్డి, శివనాసంతోష్‌ పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్‌: ఏపీఎస్సార్టీసీ కార్గో సంస్థలో డోర్‌ డెలివరీ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కార్మిక పరిషత్‌ జోనల్‌ చైర్మన్‌ పీవీఎస్‌ నారాయణ, రీజినల్‌ కార్యదర్శి ఎం.పురుషోత్తం తెలిపారు. యూనియన్‌ తరుపున 30 డోర్‌ డెలివరీ బుకింగ్‌లు చేయించారు. ఆకుల కిశోర్‌బాబు, రాజేంద్రారెడ్డి, రాధాకృష్ణ, గురుప్రసాద్‌రెడ్డి, మురళి, ఆంజనేయులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధర

జేబులు ఖాళీ చేసుకుంటున్న మధ్య తరగతి ప్రజలు



కడప రైతు బజార్‌లో కూరగాయల దుకాణాలు

కడప అగ్రికల్చర్‌: కూరగాయల ధరలు తగ్గనంటున్నాయ్‌. పండగ సమయంలోనూ బాగా పెరిగాయి. ప్రస్తుతం అవే ధరలు కొనసాగుతున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూరగాయలు కొని తినాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రైతు బజారులో టమాటా మినహా మిగతా కూరగాయల ధరలన్నీ అధికంగానే ఉన్నాయి. క్యారెట్‌ కిలో రూ.75, బీన్స్‌, కాప్సికమ్‌, అల్లం కిలో రూ.65, బీట్రూట్‌, అనపకాయలు రూ.60, చిక్కుడుకాయ, రూ.50, కాకరకాయులు, అలసందలు, మిరపకాయలు, బంగాళదుంప, రూ.40, ముల్లంగి రూ. 38, కాలీఫ్లవర్‌, దోసకాయ, బీరకాయ, మట్టికాయలు రూ.35, క్యాబేజీ రూ.28, బెండకాయ, వంకాయలు రూ.25, కిలో టమాటా రూ.14 చొప్పున రైతు బజార్‌లో ధర కొనసాగుతోంది. దీంతో సామాన్యులకు కూరగాయల కొని తినాలంటే కొంత భారంగానే ఉంది. ఈ ధరలు ఇలాగే కొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్లు రైతు బజార్‌ కూరగాయల షాపుల నిర్వాహకులు తెలిపారు.



క్యారెట్‌ కిలో రూ. 75



బీన్స్‌ కిలో రూ. 65

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బాబూరావు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్త శుద్ధితో కృషిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్‌.బాబురావు డిమాండ్‌ చేశారు. నగరంలోని రామకృష్ణ నగర్‌ సీపీఎం కార్యాలయంలో కడప జిల్లా సమగ్రాభివృద్ధి–ప్రజా ప్రణాళిక అంశంపై ఆదివారం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌ సిక్స్‌ అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్మికుల 1457 రోజుల పోరాట ఫలితంతోనే విశాఖ ఉక్కు పరిశ్రమకు నిధుల కేటాయింపు జరిగిందన్నారు. జీఎస్టీ వల్ల వ్యాపారులు చితికిపోయారని, కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్న పరిశ్రమలు మూతపడుతున్నాయని తెలిపారు. అసమానతలు తగ్గాలంటే కార్పొరేట్‌ విధానాలు పోవాలన్నారు. ఉక్కు పరిశ్రమ గురించి మాట్లాడక పోవడం దారుణమన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో 30 వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నెల్లూరులో నిర్వహించే సీపీఎం మహాసభల్లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఉచిత బస్సు ఊసే లేదు. మహిళలకు రూ.1,500 అమలు కాలేదు. గ్యాస్‌ సబ్సిడీ, తల్లికి వందనం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. మోడీ, బాబు పాలనలో కార్పొరేట్లకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్‌, కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్‌, మనోహర్‌, శివకుమార్‌, దస్తగిరి రెడ్డి శ్రీనివాసరెడ్డి సత్యనారాయణ, చాంద్‌బాషా, చంద్రారెడ్డి, కుమార స్వామిరెడ్డి, భైరవప్రసాద్‌, శివకుమార్‌, రవి, గోపాలకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సందడి

కడప కల్చరల్‌: ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలో సాంస్కృతిక వేదికపై విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. స్థానిక వర్షిణి డ్యాన్స్‌ అకాడమీ విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. శివప్రసాద్‌, మధుసూదన్‌బాబుపాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో కరస్పాండెంట్‌ సుబ్బారెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: ఈ నెల 16న బెంగళూరు యలహంక నాగార్జున డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నేషనల్‌ కరాటే చాంపియన్‌ షిప్‌ పోటీలలో కడప విద్యార్థులు విజేతలుగా నిలిచారు. స్థానిక శ్రీహరి డిగ్రీ కాలేజీ గ్రౌండెడ్‌లో శిక్షణ పొందుతున్న జెన్‌సిటో కరాటే విద్యార్థులు 11 మంది పాల్గొనగా, ఆరుగురు ఫస్ట్‌ ప్లేస్‌ ట్రోఫీ, మరో ఐదుగురు సెంకండ్‌ ప్లేస్‌ ట్రోఫీ గెలుచుకున్నారు. కరాటే కోచ్‌ విజయ్‌.కు శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్‌ సుబ్బారెడ్డి ట్రోఫీ ప్రధానం చేసి అభినందించారు.

క్యాలెండర్‌ ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్‌: అఖిల గాండ్ల తెలికల ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సంఘం(ఏపీటియూపీఎస్‌ఎస్‌) క్యాలెండర్‌ను కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసమూర్తి, విజయబాస్కర్‌, విజయబాస్కర్‌, యాదాటి శివప్రసాద్‌, లింగ రమేష్‌, యార్వ గురు ప్రసాద్‌, ప్రసాద్‌, ఆవుల వెంకటరమణ, నాగారపురెడ్డి, శంకర్‌, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాకు రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదు



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరా, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌ షా రాష్ట పర్యటనను నిరసిస్తూ ఆదివారం నగరంలోని అంబేద్కర్‌ సర్కిల్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్‌ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్‌ , ఎస్‌.వెంకట శివ, రామ్మోహన్‌, రమణయ్య, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, వేణుగోపాల్‌, మనోహర్‌, అన్వేష్‌, బాదుల్లా, మద్దిలేటి , దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, అంకుశం, రామకృష్ణారెడ్డిపాల్గొన్నారు.

కులమతాలకతీతంగా సామాజిక సేవలు



దాతలను సత్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్‌: కులమతాలకతీతంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సామాజిక సేవలందిస్తోందని సంస్థ సెంట్రల్‌ కమిటీ డైరెక్టర్‌ రాటాల గోపి అన్నారు. స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవతా సంస్థ సమావేశం డాక్టర్‌ అవటాల రామాంజులరెడ్డి గారి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయ మిత్రునిగా అందిస్తున్న సేవలు పలు కుటుంబాలను ఎంతో ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ముఖ్య అతిథులు మైథిలి, భూపతి రాయల్‌ సంస్థకు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. నాబార్డ్‌ అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ నిహారిక మాట్లాడుతూ మానవత సంస్థతో కలిసి సామాజిక బాధ్యతను తమ సంస్థ నెరవేరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్‌ ఎంఈఓ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

యునాని మెడికల్‌ కళాశాల ఏర్పాటుకు వినతి

కడప కల్చరల్‌: కడపలో యునాని మెడికల్‌ కళాశాల ఏర్పాటు చేయాలని ఆలిండియా యునాని టిబ్బి కాంగ్రెస్‌ జాతీయ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ ముస్తాక్‌ అహ్మద్‌ అన్నారు. స్థానిక అల్మాస్‌పేటలోని జామియా తుస్సాలిహాత్‌ మదరసాలో ప్రముఖ యునాని వైద్యులు డాక్టర్‌ ఎఫ్‌ఎం ముక్తార్‌ అహ్మద్‌ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్‌ ముస్తాక్‌ అహ్మద్‌ మాట్లాడుతూ కడపలో యునాని మెడికల్‌ కళాశాలతోపాటు సెంట్రల్‌ రీసెర్చి సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిబ్బి కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఎం.ఫాసిర్‌ అహ్మద్‌, రాష్ట ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ అబ్దుల్‌ మాజిద్‌ఖాన్‌, సమీవుల్లా, కరీముల్లా, హయాత్‌, ఎఫ్‌ఎం.అజ్మతుల్లా పాల్గొన్నారు.

ఉద్యోగుల హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్‌: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఇప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చికన హామీలు నెరవేర్చలేదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిండెంట్‌ మేకల శివార్జున డిమాండ్‌ చేశారు. కడపలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా 2022 సంవత్సరం నుంచి సరెండర్‌ లీవ్‌ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బకాయిలు మంజూరు చేయకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు సంక్రాంతి సంబరంగా చేసుకోలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌బాబు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్‌ల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్‌ మీడియంతోపాటు తెలుగు మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్‌ అధ్యక్షులు శేషగిరిరావు, జిల్లా కార్యదర్శి గంగాధర్‌, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఈఓలను రెగ్యులర్‌ చేయాలని వినతి



వినతిపత్రాలు చూపుతున్న ఎంపీఈఓలు

కడప అగ్రికల్చర్‌: రైతులు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తూ ముఖ్య పాత్ర పోషిస్తున్న తమను రెగ్యులర్‌ చేయాలని వ్యవసాయశాఖ ఎంపీఈఓల సంఘం రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ రెడ్డి ప్రసాద్‌, జిల్లా అధ్యక్షుడు నారాయణయాదవ్‌ డిమాండ్‌ చేశారు. కడపలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎంపీఈఓలను డిస్టిక్‌ సెలెక్షన్‌ కమిటీ ద్వారా మెరిట్‌ ప్రాతిపదికన ఎంపిక చేసిందన్నారు. గ్రామాల్లో మట్టి నమునా నుంచి విత్తనం విత్తి పంట దిగుబడుల విక్రయాల వరకు రైతులతో కలిసి పనిచేస్తున్నామన్నారు. ఏటా రెన్యూవల్‌ జీవో ఇచ్చి పారితోషికం ఇస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమించిన సచివాలయ అగ్రికల్చర్‌ అసిస్టెంట్స్‌ను రెగ్యులర్‌ చేసి రూ.34,165 జీతం ఇస్తున్నారన్నారు. తమను రెగ్యులర్‌ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్‌ ప్రెసిడెంట్‌ రవీంద్ర, జనరల్‌ సెక్రటరీలు వికాస్‌కుమార్‌రెడ్డి, బాబు, జాయింట్‌ సెక్రటరీ శ్రీవాణి, గిరిబాబు, రాజశేఖర్‌నాయక్‌ పాల్గొన్నారు.

సమాంతర మాధ్యమాన్ని అమలుచేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సీపీ.ప్రసాద్‌

కడప ఎడ్యుకేషన్‌: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర తెలుగు మాధ్యమాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్‌ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీపీ.ప్రసాద్‌ డిమాండ్‌ చేశారు. కడప ఏపీటీఎఫ్‌ అమరావతి కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైస్కూల్‌ విద్యలో తెలుగు మాధ్యమం అత్యంత అవసరమని, ఏకపక్షంగా ఇంగ్లీష్‌ మాధ్యమాన్ని మాత్రమే ప్రవేశ పెట్టడం అన్యాయమని తెలిపారు. ఏపీటీఎఫ్‌ అమరావతి కడప ,అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర , ఉమాకాంత్‌ మాట్లాడుతూ హైస్కూల్‌ వ్యవస్థలో మెర్జింగ్‌ ఎత్తివేసి ప్రాథమిక పాఠశాలలో కొనసాగిస్తే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముందన్నారు.3, 4, 5వ తరగతులు ఎక్కడున్నా సబ్జెక్టు టీచర్లు బోధించేలా విద్యాశాఖ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల 20వ తేదీ నుంచి జరగనున్న జోనల్‌ సమావేశాల్లో స్థానిక ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సాధక బాధకాలను విద్యా శాఖ తెలుసుకోవాలని కోరారు. లేకపోతే కొత్త సంస్కరణల జీవో మరో 117 జీవోగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, పద్మజ, రాజగోపాల్‌ పాల్గొన్నారు.

విశాఖ సరే.. కడప ఉక్కు సంగతేమిటి?

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: విశాఖ ఉక్కు సంగతి సరే...మరి కడప ఉక్కు సంగతేమిటనీ కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్‌ ఎన్‌.తులసి రెడ్డి ప్రశ్నించారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్‌ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 13వ షెడ్యూల్‌ ప్రకారం విభజన జరిగిన ఆరు నెలల లోపల కడప జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఉందన్నారు. సీకే.దిన్నె, జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో కావాల్సినంత భూమి ఉందని, గండికోట, మైలవరం, బ్రహ్మం సాగర్‌, సోమశిల జలాశయాలు ఉన్నాయని తెలిపారు. సున్నపురాయి, డోలమైట్‌, హేమటైట్‌, మాగ్నటైట్‌ అనంతపురం, బళ్లారి, ప్రకాశం జిల్లాల్లో కావాల్సినంత ఉందన్నారు. మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద రాయలసీమ స్టీల్స్‌ లిమిటెడ్‌ పేరుతో నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేసి, 3,892 ఎకరాలు కేటాయించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా ఉక్కు పరిశ్రమ ఊసే లేదన్నారు. ఈ సమావేశంలో జకరయ్య, సత్తార్‌, ప్రసాద్‌గౌడ్‌, రఫీక్‌, శ్యామలమ్మ, నాగరత్నం, మైనుద్దీన్‌, అమర్‌ నాథ్‌ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్‌, కాంగ్రెస్‌ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ కన్యకాంబ వ్రతం



వేదికపై వాసవీ వ్రతం చేస్తున్న వేద పండితులు



వ్రతం నిర్వహిస్తున్న వాసవాంబ దీక్ష స్వీకరించిన భక్తులు



శ్రీ వాసవాంబ

కడప కల్చరల్‌: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కడప వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం వాసవాంబ వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నవ గ్రహాలకు తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం దీక్షలో ఉన్న వంద మంది భక్తులు, 102 మంది దంపతులతో వ్రతం నిర్వహించారు. అనంతరం వ్రత కథలను వివరించారు. ఒక దశలో ఆలయం భక్తులతో నిండిపోయింది. హాజరైన భక్తులకు నిర్వాహకులు అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లం వెంకట సతీష్‌ కుమార్‌ శ్రేష్టి, అనంత పద్మనాభం శ్రేష్టి, గుండా నరసింహ శ్రేష్టి, పెసల వేణుగోపాల్‌ రావు శ్రేష్టి, ముల్లంగి శ్రవణ్‌కుమార్‌ శ్రేష్టి, నాగూరు వెంకటసాయి కేతన్‌, కాంభోజీ, గంగా శివసాయితేజ. మేడా సుదర్శన్‌, చిన్న ఎల్లయ్య, సురేంద్ర, రామ కృష్ణ, తరుణ్‌ కుమార్‌, ఆర్య వైశ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యం సమాజ దిక్సూచి

వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి



నివాళులర్పిస్తున్న వీసీ.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్‌ రఘునాథరెడ్డి



వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ రెడ్డి సంఘం నాయకులు



వేమన విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్‌సీపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌: పేద, ధనిక అసమానతలు, మూఢ విశ్వాసాలను, తూర్పార బట్టిన వేమన పద్యాలు సమాజానికి దిక్సూచి అని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వేమన జయంతి సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద వీసీతోపాటు ప్రిన్సిపల్‌ ఎస్‌.రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్‌ ఆచార్య పి.పద్మ ఆదివారం వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలో సామెతలు, జాతీయాల రూపంలో వేమన పద్యాలను ఈనాటికి గుర్తు చేసుకుంటూ ఉన్నామని తెలిపారు.

భవిష్యత్తు ఆలోచన కలిగిన మహా జ్ఞాని

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: మూఢ విశ్వాసాలను వీడాలని ప్రపంచానికి చాటి చెప్పిన మహాకవి వేమన భవిష్యత్తు ఆలోచన కలిగిన మహా జ్ఞాని అని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. వేమన జయంతి సందర్భంగా స్థానిక రాజీవ్‌మార్గ్‌లోని వేమన విగ్రహానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 400 సంవత్సరాల కిందటే ప్రజలనుద్దేశించి వేలాది పద్యాలను అందించారని, వాటిలో నిగాఢ సత్యం దాగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలోమడగలంప్రసాద్‌, ప్రతాపరెడ్డి, మునిరెడ్డి, రమేష్‌, విజయ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు వేమన

కడప సెవెన్‌రోడ్స్‌: యోగి వేమన సామాజిక విప్లవకారుడు అని ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లింగందిన్నె విజయభాస్కర్‌రెడ్డి, సారెడ్డిరామశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వేమన జయంతి సందర్భంగా కడప నగరంలోని దొంగలచెరువు కట్టపై ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలు, సాంఘిక దురాచారాలను వేమన దునుమాడారని పేర్కొన్నారు. ఆయన పద్యాలు చాలా సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో ఉంటాయన్నారు. ఆయన పద్యాలు గురించి తెలియని తెలుగు వారు ఉండరని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదన్నారు. కడప కలెక్టర్‌కు రెండవ అసిస్టెంట్‌గా పనిచేసిన సీపీబ్రౌన్‌ వేమన పద్యాలను సేకరించి 1839లో పుస్తక రూపంలో తొలిసారిగా వెలుగులోకి తీసుకువచ్చారని తెలిపారు. ముఖ్యంగా రెడ్డి కులస్తులు వేమన చూపిన మార్గంలో నడవాలనొ, ఐక్యంగా ఉంటూ పేద రెడ్డి బంధువుల సమస్యలు తమవిగా భావించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఓబుల్‌ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్‌: ప్రజా కవి యోగివేమన అని జైకె జనం కోసం యూత్‌ వెల్ఫేర్‌ సొసైటీ వ్యవస్థాపకులు లయన్‌ పటాన్‌ ఖాదర్‌బాషా అన్నారు. కడప రాజీవ్‌ పార్క్‌ వద్ద వేమన విగ్రహానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో మధుబాబు, రాయల్‌ కరీముల్లా, మధు, షేక్‌బాబు, తదితరులు పాల్గొన్నారు

భారత దేశంలోనే విశిష్టమైన కవి



మురళిని సత్కరిస్తున్న వీసీ.కృష్ణారెడ్డి, తదితరులు

కడప కల్చరల్‌: సమాజంలోని మూఢ విశ్వాసాలు, పేద, ధనిక అసమానతలను తూర్పారబట్టిన వేమన పద్యం సైద్ధాంతిక రత్నమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్‌ వైస్‌ ఛాన్సలర్‌ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగవేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం వేమన జయంతి నిర్వహించారు. ఇన్‌ఛార్జ్‌ వైస్‌ఛాన్సలర్‌ ఆచార్య కె.కృష్ణారెడ్డి అతిథులతో కలిసి వేమన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాహితీ చరిత్రలో వేమనది ఒక ప్రత్యేక అధ్యాయమని, అలతి అలతి పద్యాలతో సంఘ సంస్కరణ దిశగా కవిత్వాన్ని అల్లిన ప్రజాకవి వేమన అన్నారు. వేమన ఆశించిన నవసమాజం మన లక్ష్యం కావాలని, అందుకు అందరూ పూనుకోవాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్‌ ఆచార్య ఎస్‌.రఘునాథరెడ్డి మాట్లాడుతూ వేమన పద్య స్వభావాన్ని చూస్తే ఒక సాధారణ సమస్య మొదటి పాదంలో చెప్తాడని, రెండవ పాదంలో ఆ సమస్యకు హేతువు ఏమిటో చెప్తాడన్నారు. విశిష్ట అతిథి, ఇన్‌ఛార్జ్‌ రిజిస్ట్రార్‌ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ 17వ శతాబ్దానికి చెందిన వేమన తన కాలానికి దక్షిణ భారతదేశంలోనే విశిష్టమైన కవి అని, ఆయన గొప్ప సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ మరుగునపడిన వేమనను బ్రౌన్‌ వెలుగులోకి తీసుకురావడమే కాక ఆ పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి వేమనను విశ్వకవిని చేశాడన్నారు. ఆముదాల మురళి మాట్లాడుతూ రాజకీయ, సాంస్కృతి పరంగా అస్తవ్యస్తంగా ఉన్న తెలుగు సమాజానికి దిశా నిర్దేశం చేసిన వైతాళికులు యోగి వేమన అన్నారు. రంగస్థల నటుడు ఎస్‌.నాగముని వేమన పద్య పఠనం చేశారు. డా భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, చింతకుంట శివారెడ్డి, ఎస్‌.ఈశ్వరరెడ్డి, కష్టారావు, జానమద్ది విజయ భాస్కర్‌, రమేశ్‌రావు, జి.హరిభూషణరావు పాల్గొన్నారు.

కడప అగ్రికల్చర్‌: ప్రజల కవి యోగివేమన అని డీసీసీ బ్యాంకు డిప్యూటి రిజిస్ట్రార్‌ గుర్రప్ప అన్నారు. కడప డీసీసీ బ్యాంకులో వేమన జయంతి ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేమన క్రీస్తు శకం 1652 సంవత్సరంలో గండికోట ప్రాంతంలో జన్మించారని తెలిపారు. నాటి సామాజిక దురాచారాలపై వేమన పద్యాలు మార్పు కలిగించాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు చీఫ్‌ మేనేజర్‌ చంద్ర శేఖర్‌, మేనేజర్లు బాలాజీరాజు, బాలన్‌, అంజనేయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.